## 51. వాయిలారు నాయనారు

వెల్లాల కులస్తుడయిన వాయిలారునాయనారు మద్రాసు మైలాపూరువాసి. నిరుపమాన అచంచల శివభక్తి తత్పరుడు. మనుసు దైవమందిరాలు నిర్మించి మానసిక ఆరాధన చేసేవాడు. ఆ దైవం - దైవమందిరం క్షణం గూడ మరువజాలనవి. ఆయన ఆత్మజ్యోతి దేవునికి ఉజ్వలజ్యోతి. మానసికారాధన దైవతత్పరత నిత్యానందఝురిలో దేవదేవునికి ప్రేమానురాగామృతము అభిషేకము చేసేవాడు. ఈ అసమాన దైవభక్తికి మెచ్చి శివుడు పరమ ప్రేమాభిమానముతో అతనికి శివసాయుజ్యమొసగాడు. వాయిలార్ - వాయిలార్ నాయనారు అయ్యాడు.

ఈయన జీవితము భక్తుని పరాభక్తి పరాకాష్టను చాటుతుంది. విగ్రహారాధన, చిహ్నాలు వరుస కర్మకాండల అర్చనస్థితిని దాటి దేవదేవుని ప్రస్ఫుటంగా తనలోనే తన గుండెలోనే పదిలపరచుకొని, మమైక్య మమతలతో నిరాకర నిరంజనుని సేవించి మహోన్నతుడుగా భాసింప జేయగల భక్తి తత్త్వమీయనిది.

వాయిలార్‌ను నాయనారు వరుసలో చేర్చటంతో భక్తిమార్గం తెరగులను చూస్తాము. వారి వారి మనోస్థితిని బట్టి భక్తుల భక్తి తెరగు రూపొందుతుంది. ఏ మార్గము ననుసరించినా అందరూ పరమావధినందుకుంటారు. అది శివునితో మమైక్యత. హైందవ ఋషి సాంప్రదాయంలో దైవమార్గము మూసలో చూపేదిగాదు. అన్నిరోగాలకి ఒకే ఔషధం కాదు, అన్ని వయసులవారికి ఒకే ఆహారం కాదు. సువిశాల పరిధులలో వ్యక్తి అవసరానికి, శక్తికి అనుగుణంగా తనదైన దైవమార్గమెంచుకొని, వ్యక్తి భగవంతుని చేరగలడు. ఆ వరవడిలో అతని అంచంచలత్వము - భక్తుడు చివరకు భగవంతుని చేరుటకు దోహదం చేస్తుంది.